

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.91,235, బంగారం 6.35 గ్రాములు, వెండి 6.55 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఆందోళన ఉధృతం

- 12వ రోజుకు ప్రభుత్వ ఉద్యోగుల సామూహిక సెలవులు

- 8లో



చంద్రకళా.. నీది గొప్ప జన్మ

- 8లో

న్యూస్‌రీల్

గంజాయి పట్టుబడిన రాజస్థాన్ యువకులు



గంజాయితో పోలీసుల అదుపులో నిందితులు

జయపురం: గంజాయి బస్తాలను భుజాలపై మోసుకు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు యువకులను జయపురం సదర్ పోలీసులు అరెస్ట్ చేశారని పోలీసు అధికారి ఈశ్వర తండి సోమవారం తెలిపారు. నిందితులు పప్పు రామ్(27), జాఖీర్ ఖాన్(21)గా గుర్తించామన్నారు. వారి నుంచి 22కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2 లక్షల 20 వేలు ఉంటుందని ప్రకటించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రాజకిశోర్ బారిక్ ఆదివారం రాత్రి పోలీసు సిబ్బందితో విజయవాడ-రాంచీ 325వ జాతీయ రహదారి పాత్రొపుట్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు రెండు బస్తాలను మోసుకుంటూ వెళ్తున్నారు. అనుమానంతో వారి వద్ద ఉన్న బస్తాలను తనిఖీ చేయగా, గంజాయి పట్టుబడింది. సరుకును స్థానికంగా కొనుగోలు చేసి, రాజస్థాన్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు పట్టుబడిన గంజాయిని మెజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేయించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. ఇదిలా ఉండగా... సబ్ డివిజన్ పరిధిలో గత 6 నెలల్లో 9గంజాయి కేసులు నమోదు చేయగా, 28మందిని అరెస్ట్ చేశారు. ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన నిందితుల నుంచి 685కిలోల గంజాయితోపాటు ట్రక్కు, 5 కార్లు, స్కూటీ, 2 బైక్‌లు, 21సెల్‌ఫోన్లు, రూ.5 లక్షల 78 వేల నగదు సీజ్ చేసినట్లు ఐఐసీ వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



కలిమెల ఆరోగ్య కేంద్రంలో సుజాన్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ-23 గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడు అదే గ్రామానికి చెందిన సుజాన్ సర్కార్(60)గా గుర్తించారు. కలిమెల ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై ఐఐసీ తెలిపిన వివరాల ప్రకారం.. భార్యా, పిల్లలతో బైక్‌పై వెళ్తున్న కుటుంబాన్ని, ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న ఓ జంట ఢీకొన్నారు. రెండు వాహనాలు రోడ్డు పక్కక దూసుకుపోగా, అక్కడే నిల్చున్న వృద్ధుడు సుజాన్‌పై పడిపోయారు. దీంతో అతను కుప్పకూలిపోగా, ఎంవీ-79 ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

5వేల లీటర్ల సారా ధ్వంసం

- ఎక్సైజ్, బంజ్‌నగర్ పోలీసుల సంయుక్త దాడులు



సారా బట్టీలపై దాడులు చేస్తున్న ఎక్సైజ్, బంజ్‌నగర్ పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా పోలీసు పరిధి బంజ్‌నగర్ సమీపంలోని నువాతుట్టా అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సోమవారం సంయుక్తంగా దాడులు చేపట్టారు. ఇందులో అక్రమంగా నిల్వ ఉంచిన సారా, బెల్లం ఊటలు, సామగ్రిని స్వాధనం చేసుకున్నారు. బరంపురం ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం బంజ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధి నువాతుట్టా సాహి ఘుముసరా అటవీ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా రహస్యంగా సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించి, 5వేల లీటర్ల సారాను ధ్వంసం చేశారు. అలాగే మరో 500 లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని ఎక్సైజ్ ఏఎస్‌ఐ నిరంజన్ బెహరా తెలిపారు.

దడ పుట్టిస్తున్న ధరలు!

- సామాన్యులకు అందుబాటు లేని నిత్యావసర సామగ్రి
- విపరీతంగా పెరిగిన పప్పు దినుసులు, కూరగాయల ధరలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పేద, మధ్య తరగతి వర్గాలు



గణనీయంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు

బరంపురం: నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి తాకడంతో సామాన్యులు విలవిలాడుతున్నారు. ప్రధానంగా కందిపప్పు, ఉల్లి, కూరగాయలు, నూనెల ధరలు కంటితడి పెట్టిస్తున్నాయి. సరుకుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాల చెబుతున్నారు. దీంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మార్కెట్‌లో పప్పుల ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. గత కొద్ది రోజుల వ్యధిలో కిలో కందిపప్పు రూ.180 లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో దీని ధర రూ.100 నుంచి రూ.120 లకు ఉండేది. కిలో మినపప్పు ధర రూ.160 లకు చేరింది. దీంతో సామాన్యులు ఇడ్లీ, దోశ వంటివాటికి దూరంగా ఉప్మా, పూరీలతో సరి పెట్టుకుంటున్నారు. మరోవైపు సామాన్యులు అధికంగా వినియోగించే పామాయిల్ లీటర్ ధర రూ.140 లకు చేరుకుంది. సన్‌ఫ్లవర్ వంటనూనె రూ.200లలకు పెరగడంతో పేదలు, మధ్య తరగతి వర్గాల జీవనం కష్టతరంగా మారిందని వాపోతున్నారు.

కంటతడి పెట్టిస్తున్న ఉల్లి..

ఉల్లి లేనిదే కూర రుచించదు. అన్ని తరగతులు వారు వినియోగించే దీనికి డిమాండ్ ఎక్కువే. అయితే ఉల్లి ధరలు కొండెక్కడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. రిటైల్ బహిరంగ మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.30 నుంచి రూ.35ల వరుకు పలుకుతోంది. అలాగే టమాట కిలో 80, బంగాళా దుంపలు రూ.30, వీటితో పాటు ఇతర కురగాయల ధరలు సైతం అమాంతం పెరగడంతో సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దిగుమతులు తగ్గడాన్ని అసరాగా చేసుకున్న వ్యాపారులు.. డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని, విపరీతంగా ధరలు పెంచుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు.



మార్కెట్‌లో కూరగాయలు



విక్రయాలకు సిద్ధంగా ఉన్న పప్పు దినుసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

‘పింఛన్ లేకపోతే.. ఓట్లు ఉండవు’



సమావేశంలో పాల్గొన్న ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం సభ్యులు

- ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం నినాదానికి ఎమ్మెల్యే తారాప్రసాద్ మద్దతు

జయపురం: ఒడిశా ఈపీఎఫ్ పింఛనర్ల సంఘం న్యాయమైన డిమాండ్లకు ఎప్పుడూ తన పూర్తి మద్దతు ఉంటుందని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి స్పష్టం చేశారు. పట్టణంలోని టౌన్ హాలులో నిఖిల ఒడిశా ఈపీఎఫ్ పింఛనర్ల సంఘం ప్రథమ వార్శికోత్సవం సందర్భంగా జిల్లా సంఘం సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛనర్ల డిమాండ్లను శాసనసభలో ప్రస్తావించి, న్యాయం చేకూర్చే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. పింఛన్ లేకపోతే ఓట్లు ఉండవన్న నినాదం రానున్న ఎన్నికలలో ప్రభావం చూపుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. వారి డిమాండ్లు నేరవేరాలంటే ఎన్నికల బహిష్కరణ నిర్ణయం సరైనదేనని, ప్రభుత్వం తక్షణమే వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో ఏళ్లు సేవలందించి విరమణ పొందుతారని, అయితే చాలీచాలని పెన్షన్లతో ఇబ్బందుతులు పడుతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, కనీసం పింఛన్ రూ.9 వేలకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ల కుమార్ దాస్, కార్యదర్శి సరోజ్‌కాంత మల్లిక్, సిటీ కో-ఆర్డినేషన్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యుధిష్టర్ రౌళో, ప్రధాన కార్యదర్శి భాగ్యధర బ్రహ్మ తదితరులు మాట్లాడారు. అంతుకుముందు బహనాగా బజార్ రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి మౌనం పాటించి, నివాళులర్పించారు.

రూ.50 లక్షల వరకు

వ్యవసాయ రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఈశ్వర పాణిగ్రాహి, అధికారులు

- కేసీసీబీ చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రహి

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో రైతులకు వ్యవసాయ రుణాల పరిమితిని రూ.50 లక్షల వరకు పెంచాలని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ పరిచాలన కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు జయపురంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రహి అధ్యక్షతన డెరెక్టర్లతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఇందులో రైతుల స్వశక్తీకరణ, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే విషయంపై చర్చించింది. గతంలో రూ.10 లక్షల వరకే రుణ పరిమితి ఉండేదని, దీనిని రూ.50 లక్షలకు పెంచామని వెల్లడించారు. అలాగనే లేంపుల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పొందదచ్చని తెలిపారు. రాష్ట్ర సహకార బ్యాంక్ ఈ ఏడాది రైతులకు రూ.1000 కోట్ల వ్యవసాయ రుణాలు అందించేందుకు నిర్ణయించిందన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు సహకార బ్యాంక్‌లు పని చేస్తున్నాయని, దీనికి అనుగుణంగా కేసీసీ పరిధిలో కూడా సంస్కరణలు చేపడుతున్నట్లు ప్రకటించారు. అలాగే లేంపులలో 30శాతం అదనపు ఉద్యోగులను నియమించాలని, తద్వారా రైతులు, ప్రజలకు ఉత్యుత్తమ సేవలు అందించవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. అంతకుముందు కేసీసీ బ్యాంక్ కార్యనిర్వాహక కార్యదర్శి అజయకుమార్ లెంకను సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో రాష్ట్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ జగన్నాథ్ నుంద్రిక, బ్యాంకు ఉపాధ్యక్షుడు ధృపతి భొత్ర, డైరెక్టర్లు రమాకాంత రౌళో, బనాగడి త్రిపతి, సీనియర్ అధికారి అరుణకుమార్ సాహు, అతుల్యకుమార్ మల్లిక్, అశోక్‌కుమార్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్ జిల్లాలో పురంధేశ్వరి పర్యటన



సుంకి వద్ద పురంధేశ్వరికి స్వాగతం పలుకుతున్న బీజేపీ కార్యకర్తలు



దొలాయిగుడలో భారతమాల రోడ్డు నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

కొరాపుట్: భారతీయ జనతాపార్టీ జాతీయ సాధారణ కార్యదర్శి, పార్టీ ఒడిశా బాధ్యురాలు దగ్గుపాటి పురంధేశ్వరి కొరాపుట్ జిల్లాలో సోమవారం పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రోడ్డు మార్గంలో సాలూరు మీదుగా ఒడిశాలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సరిహద్దు సుంకి వద్ద బీజేపీ కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలకగా, వారిరతో కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతరం దొలాయిగుడ వద్ద కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విశాఖపట్నం-రాయ్‌పూర్ 6లైన్ల ఎకనామిక్ కారిడార్ నిర్మాణ పనులను పరిశీలించారు. పొట్టంగి వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో మంతనాలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా 9ఏళ్ల పాలన ముగిసిన సందర్భంగా సాధించిన విజయాలను మహాజన సంపర్క్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ఈ పర్యటన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగమే ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న భారతమాల రోడ్డు నిర్మాణమన్నారు.

దుండగుల దుశ్చర్య



దుండగులు నిప్పంటించడంతో అగ్నికి ఆహుతైన గుడిసె

- ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న గిరిజనుడి గుడిసెకు నిప్పు

జయపురం: నిలువ నీడలేక పోవడంతో ఓ ఆదివాసీ కుటుంబం ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెకు దుండగులు నిప్పంటించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ దుశ్చర్యపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని కోరాడు. బొరిగుమ్మ సమితి డెంగాపాదర్ గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనబొద భొత్ర కుటుంబంతో సహా డెంగాపాదర్ గ్రామం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కొన్ని నెలల క్రితం గుడిసె నిర్మించుకున్నాడు. చుట్టు ఉన్న ప్రదేశాన్ని శుభ్రం చేసుకొని, కూరగాయలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వచ్చి, స్థలం విడిచిపోవాలని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా మనబొద లేని సమయంలో ఆయన భార్య మైనావతిని దూషించి, ఇంట్లోని సామగ్రిని బయట పడేశారు. ఇదేమిటని ప్రశ్నించగా.. ఆమెను బయటకు నెట్టివేసి, ఇంటికి నిప్పంటించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇందులో మొత్తం 17మందికి ప్రమేయం ఉన్నట్లు వివరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు డెంగాపాదర్ గ్రామానికి చెందిన కృతి భొత్ర, చిత్తరంజన్ మాలి, ఉష్టవ మాలి, చక్ర పాయక్, త్రిలోచన నాయక్, డొంబు పూజారి, క్షీర పూజారి, దశరథ సిర, గోవర్ధన సిరా, అస్తు మాఝి, గణేష్ పాయక్, గురు పాయక్, డొంబు పాయక్, జినారి సిరా, ధనపతి సిరా, పూర్వ పూజారి, గోమతి సిరా తదితరులను అనుమానితులుగా గుర్తించారు. ఈ మేరకు బొరిగుమ్మ పోలీసు అధికారి ఖిరేశ్వర సాహు, తహసీల్దార్ డెంగాపాదర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి, వివరాలు సేకరించారు.

గ్రీవెన్స్‌కు 150 వినతులు

- గజపతి, నవరంగపూర్ జిల్లాల్లో వినతుల స్వీకరణ



మండిమరలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: గజపతి, నవరంగపూర్ జిల్లాల్లో అధికారులు నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో మొత్తం 150వినతులు అందాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొని, ప్రజల నుంచి వినతులు సోమవారం స్వీకరించారు. గజపతి జిల్లాలోని మోహానా నియోజకవర్గం మండిమరా పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ పరిపాలన, గ్రీవెన్స్‌సెల్‌కు కలెక్టర్ లింగరాజ్ పండా హాజరయ్యారు. కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ ఫాల్గుణీ మాఝి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణ పతి, మోహానా బ్లాక్ అధ్యక్షుడు రాజీవ్ శొబొరో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు కుంతలా శొబొరో తదితరులు హాజరయ్యారు. గ్రీవెన్స్‌లో 101 అభియోగాలు అందగా.. వాటిలో వ్యక్తిగతం 23, గ్రామ సమస్యలపై 78 వచ్చాయి. 5 వినతులకు గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఒకరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.20 వేల చెక్కును అందజేశారు. గ్రీవెన్స్‌కు ఖరిగుడ, రాయిపంక, మండిమర, బిరికోట్ గ్రామాల నుంచి ప్రజలు పాల్గొని, వినతులను అందజేశారు. మోహానా బీడీఓ తపస్వినీ హాంసదా, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పపడాహండిలో వినతుల స్వీకరణ..

కొరాపుట్: ప్రభుత్వం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం పపడాహండిలో అనంతరం నిర్వహించారు. నవరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా పపడాహండి సమితి కేంద్రంలోని కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి 49 వినతులు ప్రజలు అందజేశారు. ఇందులో 37 వ్యక్తిగత సమస్యలు, 12 సామాజిక సమస్యలు ఉన్నాయి. కలెక్టర్ అక్కడికక్కడే 9 సమస్యలను పరిష్కరించారు. అనంతరం 29 దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేస్తూ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ రౌత్, సమితి ఉపాధ్యక్షుడు సుశాంత్ బెహరా, సామాజిక భద్రతా అధికారి శుధాంశు పాత్రొ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి నుంచి చెక్కును అందిస్తున్న సమితి అధ్యక్షుడు రాజీవ్ శొబోరో



కొరాపుట్: గిరిజనుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కమలోచన్ మిశ్రా

క్లుప్తంగా

పలు రైళ్లు రద్దు

కాశీబుగ్గ: ఒడిశా రైలు ప్రమాదం తర్వాత రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈనెల 13వ తేదీన వెళ్లాల్సిన సంత్రాగచ్-చెన్నై, హౌరా-బెంగళూరు ఎంవీటీ, షాలీమార్-చెన్నై, షాలీమార్-హైదరాబాద్, సికింద్రాబాద్-షాలీమార్, విల్లుపురం-ఖరగ్‌పూర్ రైళ్లు రద్దు చేశారు. అదేవిధంగా 14వ తేదీన వెళ్లాల్సిన ఎస్ఎంవీటీ బెంగళూరు-హౌరా, భాగల్పూర్-బెంగళూరు, షాలీమార్-సికింద్రాబాద్ రైళ్లను సైతం రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ప్రకటన విడుదల చేసింది.

‘ప్రభుత్వ భూమిని కాపాడాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రూరల్ మండలంలో పాత్రునివలస రెవెన్యూ పరిధిలోని సుమారు 5.30 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, ఆ ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ ఆక్రమణలపై ఇటీవల ‘సాక్షి’లోనూ కథనాలు ప్రచురితమయ్యాయి. ఆ కథనాలపై స్పందిస్తూ భూములను రక్షించాలని బగాది శ్రీరామ్మూర్తి, పలువురు రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వస్తున్నా దర్జాగా ఆ భూమిని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని తెలిపారు. సాయి డెంటల్ కాలేజ్ ఎదురుగా దాదాపు 5.30 ఎకరాల ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారికి అనుకుని సర్వే నంబర్ 161/30 లో ఒక ఎకరా 18 సెంట్లు సీలింగ్ ల్యాండ్ అప్పట్లో ముగ్గురికి సాగు చేసుకోవటానికి పట్టాలు ఇచ్చారని, వారు ముగ్గురు కూడా అమ్మేశారని, అందులో భాగం డీ పట్టా భూమి ఉందని తెలిపారు. వాటిని రక్షించాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వ స్థలంలో దాదాపు 60 సెంట్లలో అక్రమంగా ఓ బిల్డింగ్ నిర్మాణం కూడా జరిగిందని దాన్ని తొలగించాలని తెలిపారు.

ఏడుగురు డీటీలకు పదోన్నతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు లభించాయి. జోన్-1 పరిధిలో గల రెవెన్యూ విభాగంలో 22 మంది ఉప తహసీల్దార్లకు డీపీసీ ద్వారా తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో జిల్లాకు చెందిన ఎన్.ప్రసాదరావు, బి.ప్రకాశరావు, ఎస్.కామేశ్వరరెడ్డి, ఎన్.రమేష్ కుమార్, జి.లక్ష్మీనారాయణ, ఎస్.గణపతి, ఎం.శ్రీకాంత్‌లు ఉన్నారు. వీరికి పోస్టింగులు ఇవ్వాల్సి ఉంది.

సజావుగా ఏపీ డీఈఈ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ఏపీ డీఈఈ సెట్-2023 నిర్వహించారు. చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 190కి 145 మంది హాజరు కాగా, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో 174 మందికి 122 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

గూడెంలో ఎలుగుబంటి హల్‌చల్



రోడ్డు దాటుతున్న ఎలుగుబంటి

టెక్కలి రూరల్: టెక్కలి నుంచి మెళియాపుట్టి వెళ్లే రహదారిపై గూడేం గ్రామ సమీపంలో సోమవారం ఒక ఎలుగు బంటి రహదారి దాటుతూ స్థానికులకు కనిపించింది. అటుగా వెళ్లిన వాహనదారులు బంటిని చూసి భయపడ్డారు. గ్రామ సమీపంలో ఎలుగు బంటి తిరుగుతుండటంతో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మలేరియా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మలేరియా నిర్మూలన, ఫ్రైడే డ్రైడే పై వైద్య ఆరోగ్య శాఖ ప్రచురించిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున, అవిరాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

రాజశ్యామల యాగం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నానుబాల వీధిలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయంలో రాజశ్యామల యాగంలో భాగంగా ఆవరణార్చనలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్య నారాయణ శర్మ, ఫణికుమార్ శర్మల నేతృత్వంలో పూజలు చేసి యాగం ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్ విశ్వేశ్వరరావు, నిర్మల, రామ్‌కుమార్ సుకన్య దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీఆర్‌లు ఇచ్చేందుకు చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డును వెడల్పు చేసేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొంతమంది ఆస్తులను కోల్పోగా నష్టపరిహారం కింద టీడీఆర్ ఇవ్వాలని కోరారు. దానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు, కమిషనర్ ఓబులేసు అంగీకారం తెలిపారు. టీడీఆర్‌లు ఇచ్చేందుకు కార్పొరేషన్ టీపీఓ ఉమామహేశ్వరరావుకి బలగ, బుచ్చిపేట ప్రాంత వాసులు వినతి పత్రం అందించారు.

ఆందోళన ఉధృతం

- స్పష్టం చేసిన జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం
- 12వ రోజు కొనసాగిన సామూహిక సెలవులు



మాట్లాడుతున్న అమలా సంఘం నాయకులు ప్రసాద్‌కుమార్ పాత్రో



వివరాలను మీడియాకు వివరిస్తున్న అమలా సంఘం కోశాధికారి శంకర్‌లాల్



మల్కన్‌గిరి: కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అమలా సంఘం సభ్యులు

పర్లాకిమిడి:

వివిధ డిమాండ్ల పరిష్కారం కోరుతూ మినిస్టీరియల్ సంఘం ఉద్యోగులు చేపట్టిన నిరసన లు 12వ రోజుకు చేరుకున్నాయి. అయితే ప్రభుత్వం ఇప్పటికీ స్పందించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘం నాయకులు.. రానున్న రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు మే 22 నుండి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ విధులు నిర్వహించారు. అయితే ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం అమలా సంఘం ఉద్యోగులతో జరిపిన చర్చలు ఫలించలేదు. ఈ మేరకు జిల్లా ఉద్యోగ సంఘం పర్లాకిమిడిల లోని బాలాజీ కల్యాణ మండపంలో సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మిళిత అమలా సంఘం కన్వీనర్ ప్రసాద్‌కుమార్ పాత్రో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం గ్రేడ్‌పే రూ.1,900ల నుంచి రూ.4,200లకు పెంచాలని 2017 నుంచి డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. అయితే మూడో తరగతి ఉద్యోగులకు ఏదైనా డిగ్రీని కనీస విద్యార్హతగా నిబంధన విధించడంతో చాలామంది నష్ట పోతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, రాష్ట్రంలోని ప్రతి శాఖలో పనిచేస్తున్న 40వేల మంది మినిస్టీరియల్ ఉద్యోగులకు గ్రేడ్‌పే రూ.4,200లకు పెంచాలని కోరారు. దీనిపై ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టంచేశారు. రానున్న రోజుల్లో రాజధాని భువనేశ్వర్ ముట్టడికి సైతం వెనుకాడమని ఓఎంఎ నాయకులు శంకర్‌లాల్ సోరెన్ హెచ్చరించారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు కూర్మ రథ్, కార్యదర్శి మున్నా పట్నాయక్, ట్రెజరీ ఎంప్లాయీస్ యూనియన్ శిశిరో పాణిగ్రాహి, సబ్ రిజిస్ట్రార్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



మల్కన్‌గిరి: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

నిలిచిన సేవలు..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట అహలా సంఘం సభ్యులు, ప్రభుత్వ గుమస్తాలు చేపట్టిన నిరసనలు కొనసాగాయి. గ్రేడ్‌పే పెంపు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 1నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సామూహికంగా సెలవులు పెట్టిన ఉద్యోగులు.. నిరవధిక ధర్నా చేపట్టారు. ఈ మేరకు జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ నెలవారీ వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో విధుల్లోకి చేరేది లేదని తెగేసి చెప్పారు. డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని ఉన్నతాధికారులను సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయన్ శెతి కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు సురేంద్ర పట్నాయక్, శ్యామ్‌సుందర్ నాయక్, లక్ష్మీధర్ దాస్, చిలిపి కృష్ణ తదిరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఉద్యోగుల సెలవులతో ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

విత్తన ఎంపికే కీలకం..

- సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు
- 656 ఆర్‌బీకేల ద్వారా పంపిణీకి చర్యలు



వరిచేను (ఫైల్)

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, కొద్దిపాటి వర్షాలు కూడా పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అవుతున్నారు. ఎలాంటి పంటలను సాగు చేయాలి, విత్తనాల ఎంపికపై ఆలోచనలు చేస్తున్నారు. ఏ రకం వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి, ఏ రకం వేస్తే తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయో ఆలోచన చేస్తున్నారు. ఈ పరిస్థితిలో విత్తన ఎంపికే కీలకమని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సుమారు ఐదు నెలల కాలపరిమితిలో పంట సాగు చేస్తే ధాన్యం దిగుబడులు చేతికి వస్తాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు అందుబాటులోకి రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చి వాటి ద్వారా రైతులకు విశిష్ట సేవలను అందిస్తుంది. వ్యవసాయాన్ని పండుగలా చేసుకునే విధంగా ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు కావాల్సిన విత్తనాలను సరఫరా చేస్తుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో ముందుగానే అర్డర్ చేసుకోవడం ద్వారా ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందుతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులకు నచ్చిన విత్తనాలను ఎంపిక చేసుకునేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో 30 మండలాల పరిధిలో 1.78 లక్షల హెక్టార్లలో వరిని సాగు చేస్తుంటారు. దీనికి అనుగుణంగా 656 ఆర్‌బీకేల ద్వారా 35,040 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. రైతులు తగిన విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించగలరని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సూచించారు. ఏ రకం విత్తనం.. ఏ నేలకు అనుకూలమో వివరించారు.



మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస

అందుబాటులో ఉన్న వరి విత్తనాలు

- ఎంటీయూ 1121 శ్రీధృతి రకం పంట కాలం 140-142 రోజులకు గాను ఎకరాకు 28.30 బస్తాల దిగుబడి వస్తుంది. ఆకు ముడత పురుగును తట్టుకుంటుంది.
- ఎంటీయూ 7029 స్వర్ణ రకం పంట కాలం 150-152 రోజులు. ఎకరాకు 26.50 బస్తాల దిగుబడిని ఇస్తుంది.
- బీపీటీ 5204 సాంబమసూరి రకం పంటకాలం 143-145 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 28.50 బస్తాల దిగుబడిని ఇస్తుంది.
- ఎంటీయూ 1315 రకం పంటకాలం 145-148 రోజులకు ఎకరాకు 24.50 బస్తాల దిగుబడి వస్తుంది. మధ్యస్థ సన్న రకం, తెలుపు గింజ, అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగుళ్లను గతంలో శాస్త్రవేత్తలు గమనించారు.
- ఎంటీయూ 1318 రకం పంట కాలం 155-160 రోజులు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. అధిక పిలకలు వేసి దిగుబడి బాగున్నప్పటికీ అపరాలు చేస్తున్న ప్రాంతానికి అనువుగా లేదు. వరి తరువాత మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేస్తున్న ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- ఆర్‌జీఎల్ 2537 శ్రీకాకుళం సన్నాల రకం 160 రోజుల్లో ఎకరాకు 30 బస్తాల దిగుబడిని ఇస్తుంది. మధ్యస్థ సన్న గింజ రకం. 160 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. చేను ఎక్కువగా పడిపోతుంది.
- ఎంటీయూ 1224 మార్టేరు సాంబ రకం 135 రోజుల్లో ఎకరాకు 26 నుంచి 28 బస్తాల దిగుబడి వస్తుంది. పంట చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలం.
- బీపీటీ 3291 సోనామసూరి రకం 135 నుంచి 140 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. గింజ సన్నంగా ఉండి, అన్నానికి బాగుంటుంది. ● ఎంటీయూ 1210 సుజాత రకం 125 నుంచి 135 రోజుల్లో ఎకరానికి 26 నుంచి 28 బస్తాల వరకు దిగుబడిని ఇస్తుంది. కాండం ధృడంగా ఉండి, చేను పడిపోదు. గింజ రాలిక తక్కువ. నేరుగా విత్తే విధానానికి కూడా అనుకూలం. ● ఎంటీయూ 1061 ఇంద్ర రకం 150 రోజుల్లో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. సన్న గింజగా ఉండి తెలుపు రంగులో ఉంటుంది. చేను పడిపోదు. పది రోజుల వరకు ముంపును, కొద్దిపాటి చౌడును తట్టుకుంటుంది
- యంటియూ 1010 కాటన్ దొర సన్నాలు రకం 120 రోజుల్లో 32 బస్తాల దిగుబడిని వస్తుంది. గింజ సన్నగా.. పొడుగ్గా ఉంటుంది. ఎగుమతులకు అనుకూలం.

లక్ష్మీపేట దళితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గణేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజయనగరం జిల్లా వంగర మండలం లక్ష్మీపేట సంఘటన జరిగి 11 సంవత్సరాలు పూర్తయినా దళితులకు మాత్రం న్యాయం చేయలేదని సామాజిక న్యాయపోరాట సమితి నాయకులు అన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. మడ్డువలస రిజర్వాయర్‌లోని 250 ఎకరాల భూమిని దళితులకు పంపిణీ చేయాలి సమితి జిల్లా ప్రధానకార్యదర్శి డి.గణేష్, మాదిగ దండోరా జిల్లా నాయకులు కానుకుర్తి గోవింద్, యడ్ల జానకీరావులు కోరారు. లక్ష్మీపేట ఘటన జరిగి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అప్పట్లో సీఎంగా ఉన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీలను ప్రస్తుత పాలకులు అమలు చేయాలని కోరారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిరిపురపు గురువులు, దూలపు అప్పన్న, రమణ, బాలకృష్ణ, వీరస్వామి, కుప్పిలి నుకున్నా, మురపాక వాసుదేవరావు, ఉర్లాపూ దుర్గారావు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



భీమారావు మృతదేహం

టెక్కలి రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పాతనౌపడ గ్రామంలో చోటుచేసుకోగా ఇజ్జువరపు భీమారావు(48) ప్రాణాలు కోల్పోయినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. భీమారావు తన గ్రామంలో ఆదివారం జరిగిన శుభకార్యానికి హాజరై అధికంగా మద్యం తాగి ఇంటి వెళ్లాడు. దీంతో నిత్యం మందుతాగి ఎందుకు వేధిస్తున్నారని భార్య నిర్మల మందలించింది. మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ తప్పిపడిపోయాడు. అయితే సోమవారం ఉదయం చూసే సరికి భీమారావు నోటి నుంచి నురగలు రావడం గమనించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

చంద్రకళా.. నీది గొప్ప జన్మ



చిన్నారులకు నగదును అందిస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: తాను చనిపోతూ మరో ఎనిమిది మందికి పునర్జన్మ ప్రసాదించిన పట్నాన చంద్రకళను గ్రామస్తులు వేనోళ్ల కీర్తించారు. చంద్రకళ చేసిన త్యాగం నిరుపమానమని, ఆమెది గొప్ప జన్మ అని కొనియాడారు. మండలం మధుపాం గ్రామానికి చెందిన పట్నాన చంద్రకళ(32) బ్రెయిన్‌డెడ్ అవ్వడంతో ఈనెల 2వ తేదీన మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె అవయవాలను దానం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో చంద్రకళ సంతాప సభ నిర్వహించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో స్థానికులు, యువత కలిపి రూ.2 లక్షలు సేకరించి వారి పేరున డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బగాది అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ నల్లి తవిటినాయుడులతో పాటు గ్రామస్తులు, యువత పాల్గొన్నారు. ఈ కుటుంబంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

● మత్తు వదలరా..



డ్రగ్స్ జోలికి పోవద్దంటూ పోలీసులు నినాదమిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాకుళంలో ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో మానవ హారం, ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. - శ్రీకాకుళం క్రైం

చరిత్రలో తొలిసారి



డీసీసీబీ ప్రధాన కార్యాలయం



- పీఏసీఎస్‌లకు రూ.5.30కోట్ల మేర డెవిడెంట్ అందజేస్తున్న డీసీసీబీ
- పెరిగిన ఆర్థిక కార్యకలాపాలతో భారీగా లాభాలు
- వచ్చిన లాభాలను పీఏసీఎస్‌లకు పంచిపెడుతున్న డీసీసీబీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చరిత్రలో తొలిసారిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు(పీఏసీఎస్) అత్యధిక డెవిడెంట్ అందజేస్తోంది. 87 ఏళ్ల చరిత్ర గల డీసీసీబీ 2022-23లో అత్యధికంగా రూ.15 కోట్ల లాభాలను ఆర్జించింది. తనకు వచ్చిన లాభాలను సభ్యులుగా ఉన్న పీఏసీఎస్‌లకు 6శాతం డెవిడెంట్ కింద పంచిపెడుతోంది. దాదాపు రూ.5.30కోట్లను జిల్లాలోని 49 పీఏసీఎస్‌లకు పంపిణీ చేస్తోంది. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో రెండో ఫ్లోర్ శంకుస్థాపన సందర్భంగా మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద్ చేతుల మీదుగా డెవిడెంట్ అందజేసే కార్యక్రమం జరగనుంది.

ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం..



డీసీసీబీ తన పరిధిలో ఉన్న పీఏసీఎస్‌లకు లాభాలు పంచి పెట్టడమనేది చాలా అరుదు. అది కూడా 1, 2శాతం డెవిడెంట్ రూపంలో ఇస్తూ వచ్చేది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, పాలకవర్గం చొరవ, అధికారుల పనితీరుతో డీసీసీబీ కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. దీంతో 2019 నాటికి రూ.1071.36కోట్ల మేర ఉన్న టర్నోవర్ ఇప్పుడు రూ.2047.28కోట్లకు పెరిగింది. గతంలో రూ.438.69కోట్లు ఆప్కాబ్ నుంచి అప్పుగా తీసుకోగా ఇప్పుడది రూ.1353.51కోట్లకు పెరిగింది. షేర్ కేపిటల్ అండ్ రిజర్వు కింద 2019లో రూ.103.77కోట్లు ఉండగా ఇప్పుడది రూ.198.47 కోట్లకు చేరింది. 2019లో రూ.347.47కోట్ల మేర డిపాజిట్లు ఉండగా ఇప్పుడవి రూ.429.33కోట్లకు పెరిగింది. పెట్టుబడులు సైతం 2019లో రూ.137.5 కోట్లు ఉండగా ఇప్పుడవి రూ.1533.82కోట్లకు చేరా యి. రుణాలు, అడ్వాన్సుల కింద 2019లో రూ.723.89కోట్లు ఉండగా ఇప్పుడవి రూ. 1617.95 కోట్లకు పైగా చేరింది. ఎన్‌పీఏ కూడా గతంలో 3.52శాతం ఉండగా ఇప్పుడది 2.51శాతానికి తగ్గింది. 2019లో రూ.4.18కోట్ల మేర వార్షిక లాభం పొందగా ఇప్పుడది రూ. 15కోట్లకు దాటింది. ఇలా అన్ని రకాలుగా డీసీసీబీ ప్రగతి సాధించింది.

లాభాలను పంచుతూ..

ఆర్థిక కార్యకలాపాలను పెంచుకుని అభివృద్ధి చెందుతున్న డీసీసీబీ తొలిసారిగా తన పరిధిలో ఉన్న పీఏసీఎస్‌లకు ఆర్థిక లబ్ధిని కూడా చేకూరుస్తోంది. పీఏసీఎస్‌లకు ఇచ్చిన రుణ సాయంలో నిబంధనల మేరకు 10శాతం షేర్ కేపిటల్ కింద తన వద్ద ఉంచుకుంటోంది. ఈ విధంగా 2022-23లో క్రాప్ లోన్స్ కింద రూ.765.85కోట్లు, షార్ట్ టర్మ్ రుణాల కింద రూ. 487.19కోట్లు, లాంగ్ టర్మ్ రుణాల కింద 18.95కోట్లు పీఏసీఎస్‌లకు ఇచ్చింది. మొత్తంగా చూస్తే ఒక్క పీఏసీఎస్‌లకే రూ.1271.99కోట్లు రుణాల రూపంలో అందజేసింది. దీంతో 10శాతం షేర్ కేపిటల్ కింద రూ.133.96కోట్లు ఉంచుకుంది. ఇప్పుడా షేర్ కేపిటల్‌కు 6శాతం డెవిడెంట్ అందజేస్తున్నది. ఎప్పుడూ లేని విధంగా రూ.15కోట్ల మేర డీసీసీబీకి లాభాలు రావడంతో అందులో రూ.5.30 కోట్ల మేరకు 49 పీఏసీఎస్‌లకు డెవిడెంట్ కింద మంగళవారం పంపిణీ చేయనుంది. డీసీసీబీ చరిత్రలో ఇదొక రికార్డు.

రుణాల్లోనూ మెరుగ్గా..

డీసీసీబీ అనేక రకాలుగా రైతులకు రుణాలు అందిస్తోంది. డీసీసీబీ పరిధిలో 49 పీఏసీఎస్‌లు, 86బి క్లాస్ సొసైటీలు ఉన్నాయి. ఒక్క పీఏసీఎస్‌ల్లో 2,29,873మంది సభ్యులుండగా, రుణ గ్రహీతలు 1,64,061 మంది ఉన్నారు. సీకేసీసీ ఖాతాదారులైతే 1.23.516మంది ఉన్నారు. మొత్తంగా 2,94,201మంది ఖాతాదారులు డీసీసీబీ సేవలు పొందుతున్నారు. గతంలో ఒక్క క్రాప్, గోల్డ్ రుణాలకే పరిమితమయ్యేది. ఇప్పుడు పరిధి బాగా పెరిగింది. క్రాప్ రుణాల కింద లక్షా 18వేల మంది రైతులకు రూ.800కోట్ల మేర అందించింది. ఆప్కాబ్ నుంచి రూ. 5శాతం వడ్డీకి రుణం తీసుకోగా పీఏసీఎస్‌లకు 5.75శాతంకే ఇచ్చి, వాటి ద్వారా రైతులకు 7శాతం వడ్డీతో పీఏసీఎస్‌ల ద్వారా రుణాలిస్తోంది. బంగారు రుణాలను అత్యధికంగా రూ. 15లక్షలు వరకు ఇస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.317.89కోట్లను బంగారు రుణాల కింద అందజేసింది. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న రైతులకు రూ.32 కోట్ల మేర రుణాలు అందజేసింది. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లుగా ఏర్పడిన రైతు సంఘాలకు రూ. 35.06కోట్లతో 586 ట్రాక్టర్లు, రూ.5.46కోట్ల విలువైన 43 హార్వెస్టింగ్ యూనిట్లు అందజేసింది. రూ.13.10కోట్ల విలువైన ఇంప్లిమెంట్స్‌ను 819మందికి అందజేసింది. ఇలా వివిధ రకాల రుణాలను అందజేసి, తన కార్యకలాపాలను రోజురోజుకీ విస్తృతం చేసింది.

క్లుప్తంగా

1750 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం వద్ద సీఎస్‌డీటీ తదితరులు

బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 1750 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, పౌరసరఫరాల సంస్థ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కొల్లా సూర్యారావు ఈ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసినట్లు సమాచారం అందుకున్న మేరకు సోదా చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌరసరఫరాల ఉప తహసీల్దార్ ఆర్.సాయికృష్ణ విలేకరులకు తెలిపారు. బియ్యాన్ని కస్టోడియన్‌కు అప్పగించి సూర్యారావుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రేషన్ పంపిణీలో అవకతవకలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

గంట్యాడ: రేషన్ పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ తహసీల్దార్ ప్రసన్న రాఘవకు పెదవేమలి గ్రామ సర్పంచ్ వర్రి పాపు నాయుడు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో రేషన్ బియ్యం వాహనం ద్వారా సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే చనిపోయిన వ్యక్తుల పేరున, కరోనా సమయంలో ఇచ్చిన ఉచిత బియ్యం లబ్ధిదారులకు అందకుండా అక్రమాలకు పాల్పడ్డారని, ఏడాది కాలంగా జరిగిన లావాదేవీలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

గరుగుబిల్లి: ఎండ తీవ్రత కారణంగా వంగర మండలం రాజుల గుమడ గ్రామానికి చెందిన మిరియాల శంకరరావు వడదెబ్బకు గురై సోమవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావుపల్లిలో గల మామిడి తోటలో మామిడి కాయలు కోయడానికి శంకరరావు సోమవారం వచ్చాడు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన సమయంలో వడదెబ్బకు గురై మృతిచెందినట్లు ఆయన కుమారుడు పృథ్వీ తెలిపాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అరుణ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై ధర్మారావు

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు గ్రామానికి చెందిన చోల అరుణ్‌కుమార్(38) ఆదివారం ఉదయం తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా వైద్య సేవలు పొందుతూ సోమవారం మృతిచెందాడు. గ్రామంలో గల ఉన్నత పాఠశాల గేటు ఎక్కేందుకు ప్రయత్నించిన అరుణ్‌కుమార్ ప్రమాదవశాత్తు తలకిందులుగా కింద పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ క్రమంలో మెరుగైన వైద్య సేవల కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య గౌరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై ధర్మారావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: చోరీ కేసులో నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉడాకాలనీలో కె. శైలజ మెడికల్ షాపు నిర్వహిస్తోంది. షాపులో ఉండగానే గుర్తు తెలియని వ్యక్తి తన పర్స్‌ను దొంగిలించుకుపోయినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన వన్‌టౌన్ పోలీసులు గుర్ల మండలం చింతల పేటకు చెందిన పిల్లా కుమార్‌ను స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్టు చేసి రూ.13వేలు నగదు రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆక్రమణల పరిశీలన



కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్, రెవెన్యూ సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస వద్ద కొండ ఆక్రమణలపై 'కొండంత అక్రమం' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి జేసీ మయూరి అశోక్, బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ స్పందించారు. కొండ ఆక్రమనలను పరిశీలించి నివేదిక అందజేయాలని తహసీల్దార్ రమేష్‌ను ఆదేశించారు. ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి కొండను పరిశీలించారు. ఆక్రమణలపై ఆరా తీశారు. కొండపై తవ్వకాలు జరగకుండా, ఆక్రమణలు జరగకుండా ఇద్దరు వీఆర్వోలను కాపలా ఉంచుతామని చెప్పారు.

పచ్చిరొట్టతో భూ సారం మెండు



ఈ తరహా పచ్చిరొట్టతో భూమిలో అధిక సారం

- కేరళను తాకిన రుతుపవనాలు
- మరికొద్ది రోజుల్లో కురవనున్న వర్షాలు
- జిల్లాకు 3, 370 కింటాళ్ల విత్తనాల కేటాయింపు
- ఆర్‌బీకేల ద్వారా రాయితీపై రైతులకు అందజేత

పాలకొండ రూరల్: మృగశిర కార్తె ప్రారంభం కావడంతో అన్నదాతలు సేద్యానికి సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే రుతుపవనాలు కేరళను తాకడంతో మరికొద్ది రోజుల్లో వర్షాలు ఆశాజనకంగా కురుస్తాయన్న సూచనలతో రైతులు పొలంబాట పట్టారు. ఈ ఏడాది జిల్లాలో 73వేల హెక్టార్లలో వరి సేద్యానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో సేద్యానికి ముందు భూ సారం పెంపొందించుకునేందుకు జిల్లా పరిధిలో 15 మండలాలకు సంబంధించి రైతుల అవసరాల మేరకు 3 వేల 370 కింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు రాయితీపై ఈ విత్తనాలు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించారు. ఈ క్రమంలో వాతావరణ అనుకూలతను ఆసరాగా చేసుకుని పచ్చిరొట్ట సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలో పచ్చిరొట్ట పూతదశకు చేరుకుంటుంది. వరి నాట్లు వేసే సమయానికి ఈ పంట అదునుకు వస్తుంది. ఖరీఫ్ సేద్యానికి ముందుగా పచ్చిరొట్ట సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు.

మెట్ట భూముల్లో..

మెట్ట భూముల్లో తగ్గిపోతున్న స్థూల, సూక్ష్మ పోషకాలను పెంచుకునేందుకు పచ్చిరొట్ట ఎంతో ఉపయోగకరం. గతంలో పాడి సంపద నుంచి సేకరించిన పశువుల ఎరువు వాడకం వల్ల సాగుభూమికి సత్తువ చేకూరేది. ముఖ్యంగా సేంద్రియ విధానంతో భూసారం పెంచడం వల్ల బహుళ ప్రయోజనాలు సమకూరేవి. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం గణనీయంగా పెరగడంతో భూమి నుంచి పైరుకు అవసరమైన పోషకాలు లభించడం లేదు. రైతు రెండు పంటలు వేసిన తరువాత పచ్చిరొట్ట సాగు చేయడం లాభదాయకమని గుర్తించాలి.

ప్రయోజనాలు మెండు..

పచ్చిరొట్ట పైరులైన జీలుగు, పిల్లిపెసర, జనుము సేద్యం వల్ల సేంద్రియ పదార్థాలు భూమికి లభిస్తాయి. కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు మెండుగా లభిస్తాయి. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గుతుంది. రసాయన ఎరువులు భూమి అంతర పొరలకు చేరిపోకుండా అడ్డుకట్ట వేయవచ్చు. నేలలో చౌడును తగ్గిస్తూ శీతాకాలంలో కూడా భూ అంతర పొరల్లో ఉష్ణోగ్రత సమతుల్యతను కాపాడుతుంది ముఖ్యంగా చౌడు, జీలుగు, నీటి నిల్వలున్న భూముల్లో పచ్చిరొట్ట (జనుము) సేద్యం చేయాల్సి ఉంటుంది.

ఎకరాకి ఎంత మోతాదులో..

జీలుగు, పిల్లిపెసర ఎకరాకి 16 కిలోలు, జనుము 20 కిలోల వంతున వేయాల్సి ఉంటుంది. దీనివల్ల జీలుగు హెక్టారుకు 20 టన్నులు, జనుము 21 టన్నులు, పిల్లిపెసర 18టన్నుల దిగుబడి వస్తుంది. ఓవైపు పశుగ్రాసం కొరత అధిగమించడంతో పాటు మరోవైపు భూమిని సారవంతం చేసుకోవచ్చు. పచ్చిరొట్ట పూత సమయంలో పంటభూమిలో కలియదున్నడంతో నత్రజని 1.8 నుంచి 3.5 శాతం సమకూరుతుంది. భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2.0 శాతం భూమికి లభిస్తుంది. సూక్ష్మపోషకాలు సమకూరుతాయి. పంట ఎదుగుదల, దిగుబడిలో ఈ పోషకాలు కీలంగా సహకరిస్తాయి. రసాయన ఎరువుల వాడకం 30 శాతం మేరకు తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్ట సేద్యంతో భూమికి అవసరమైన కాల్షియం, నత్రజని, మాంగనీస్, గంధకం, జింకు వంటి సూక్ష్మ ధాతువులు పుష్కలంగా సమకూరుతాయి. నీటి నిల్వలు భూమి లోపల పొరలలో నిల్వ ఉండి సేద్యానికి సహకరిస్తాయి. భూమి ఆరోగ్యవంతంగా మారుతుంది. ఈ ప్రక్రియ తరువాత నాట్లు వేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు.

సత్ఫలితాలు సాధ్యం



రెండేళ్లకు ఓసారి పచ్చిరొట్ట సేద్యం చేయడం వల్ల సత్ఫలితాలు సాధించవచ్చు. ముఖ్యంగా ఎదలు వేసే రైతులకు తొలిదశలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో సేద్యంపై ప్రభావం పడుతుంది. పచ్చిరొట్ట వాడడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చు. రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు. భూ సారం పెంచడం వల్ల అధిక దిగుబడులు సులభతరమవుతాయి. పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా అందించడంతో పాటు విస్తృతంగా రైతుల్లో అవగాహన కల్పించాం.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు, పాలకొండ

14 నుంచి ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్



ప్రభుత్వ ఐటీఐ, విజయనగరం

- జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టి.వి.గిరి

విజయనగరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో 2023 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విజయనగరం ప్రభుత్వం ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి సోమవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ధ్రువపత్రాల పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు వారి జీపీఏ మార్కుల ఆధారంగా కేటాయించిన ర్యాంకుల బట్టి వారికి కేటాయించిన తేదీలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని చెప్పారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్

తేదీ	సమయం	ర్యాంకు
14.06.23	ఉ. 9 నుంచి మ. 1 గంట	1-122
14.06.23	మ. 2 నుంచి సా. 5 గంటలు	123-253
15.06.23	ఉ. 9 నుంచి మ. 1 గంట	254-411
15.06.23	మ. 2 నుంచి సా. 5 గంటలు	412-576
16.06.23	ఉ. 9 నుంచి మ. 1 గంట	577-741
16.06.23	మ. 2 నుంచి సా. 5 గంటలు	742-895
17.06.23	ఉ. 9 గంటల నుంచి మ. 1 గంటలు	896-1092
జనరల్ పూల్		
18.06.23	ఉ. 9 గంటల నుంచి	1-576
19.06.23	ఉ. 9 గంటల నుంచి	577-1082

నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు వారి సమస్యలను స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ. దిలీప్ కిరణ్, ఎస్పీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరోపణలపై సమగ్ర విచారణ

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య వినతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గంలో జాతీయ హరిత రహదారి నిర్మాణానికి చేపట్టిన భూసేకరణలో రూ. 25 కోట్లు మేర కుంభకోణం జరిగిందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పల నాయుడు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాను శాసన సభ్యుడిగా ఎన్నికైన నాటి నుంచి భూదందాలు, ఇసుక వ్యాపారం చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏదైనా తప్పుజరిగినట్లు తెలిస్తే వెంటనే తాను వెంటనే స్పందించి అధికారుల ద్వారా సరిదిద్దే కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఏవైతే అవినీతి ఆరోపణలు తనపై చేశారో దానిమీద సమగ్ర విచారణ జరిపించాలని సోమవారం సాయంత్రం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశానని తెలిపారు. ఇటువంటి అవకతవకలు ఏవైనా ఉంటే మరిన్ని తెలియజేయాలని వాటిపై సమగ్ర దర్యాప్తు చేయించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గారతవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, వ్యవసాయసలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, మధుపాడ సర్పంచ్ కె.పైడిపు నాయుడులతో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు మండల సురేష్, రేగ సురేష్, బైరెడ్డి శ్రీను, కె.రామునాయుడులతో పాటు పలువురు పాల్గొన్నారు.

లక్ష్మీపేట దళితులకు న్యాయం చేయాలి

- సామాజిక న్యాయపోరాట సమితి విజ్ఞప్తి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజయనగరం జిల్లా వంగర మండలం లక్ష్మీపేట సంఘటన జరిగి 11 సంవత్సరాలు పూర్తయినా దళితులకు మాత్రం న్యాయం చేయలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని సామాజిక న్యాయపోరాట సమితి నాయకులు కోరారు. మడ్డువలస రిజర్వాయర్‌లోని 250 ఎకరాల భూమిని దళితులకు పంపిణీ చేయాలని సమితి జిల్లా ప్రధానకార్యదర్శి డి.గణేష్, మాదిగ దండోరా జిల్లా నాయకులు కానుకుర్తి గోవింద్, యడ్ల జానకీరావులు కోరారు. లక్ష్మీపేట ఘటన జరిగి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అప్పట్లో సీఎంగా ఉన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీలను ప్రస్తుత పాలకులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిరిపురపు గురువులు, దూలపు అప్పన్న, రమణ, బాలకృష్ణ, వీరస్వామి, కుప్పిలి సుకున్నా, మురపాక వాసుదేవరావు, ఉర్లాపు దుర్గారావు పాల్గొన్నారు.

అత్తను గాయపరిచిన కోడలు



చికిత్స పొందుతున్న వనజాక్షి



చికిత్స పొందుతున్న కేసరి

పార్వతీపురం: కుటుంబ కలహాలతో అత్తను కోడలు గాయపరిచింది. సోమవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలోని రామాపురం కాలనీకి చెందిన జి.వనజాక్షి తన కోడలు హేమతో కుటుంబ సమస్యలు చర్చిస్తున్న సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో కోడలు హేమ అత్త వనజాక్షిని పలు చోట్ల గాయపరిచింది. దీంతో అత్తను చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అకారణంగా దాడి

పార్వతీపురం మండలం తాన్నవలస గ్రామానికి చెందిన ఎం.కేసరి ఇంటి ముందు మంచంపై పడుకుని ఉండగా అదే గ్రామానికి చెందిన ఎం.అర్సు తాగివచ్చి కర్రతో అకారణంగా కొట్టాడు. ఈ ఘటనలో కేసరికి గాయం కావడంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె 38 ఫిర్యాదులను సోమవారం స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని సూచించారు. తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ జి.రాంబాబు, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సర్..!

- ఉపసభాపతిని కలిసిన ఒప్పంద అధ్యాపకులు



ఉపసభాపతితో కాంట్రాక్ట్ ఉద్యోగులు

విజయనగరం: తమ సర్వీసును క్రమబద్ధీకరించి, జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి సర్వదా రుణపడి ఉంటామని ప్రభుత్వ ఒప్పంద అధ్యాపకులు వెల్లడించారు. 2014 జూన్ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారోజు ఈశ్వర వెంకటరావు ఆధ్వర్యంలో సంఘం జిల్లా నాయకులు ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామిని సోమవారం ఆయన నివాసం వద్ద కలిశారు. థాంక్యూ సీఎం సర్..అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 1507 మంది.. జిల్లాకు సంబంధించి 135 మంది ఒప్పంద అధ్యాపకులకు ప్రయోజనం కలుగుతోందని కోలగట్లకు వారు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.సూరపునాయుడు, ఎన్.శ్రీను, సత్యనారాయణ, అశోక్ కుమార్, రాజశేఖర్, ప్రసాద్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. విజయనగరం కోట కూడలి వద్ద ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని సోమవారం ప్రారంభించారు. బాలల కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ హిమబిందు, సభ్యులు భవానీ, జిల్లా బాలకార్మిక సహాయ కమిషనర్ ఎ.టి శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ బెందు వెంకటరావు, డీసీపీయూ అల్లు సత్యనారాయణ, నాగరాజు, సంధ్య, వి.సంధ్య పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించే సిబ్బందికి నోటీసులివ్వాలి

- అసంతృప్తి వ్యక్తమైన వినతులపై కలెక్టర్ నాగలక్ష్మి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారం సరైన రీతిలో చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించే ప్రభుత్వ శాఖల సిబ్బందికి చార్జ్‌మెమోలు జారీ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులకు సరైన పరిష్కారం చూపకుండానే మూసివేయడం వల్ల ఆయా పిటిషనర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తరచూ ఒకే సమస్యపై వినతులు పదే పదే అందిస్తున్నారని చెప్పారు. పిటిషనర్‌కు సంతృప్తి కలిగించే విధంగా ఆయా ప్రభుత్వ శాఖలు చర్యలు చేపట్టిన తర్వాత మాత్రమే సంబంధిత చర్యలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పరిష్కరించినట్లు చూపాలన్నారు. వినతుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయి ఆయా గ్రామాలు, వార్డుల్లో విచారణకు వెళ్లేటప్పుడు పిటిషన్‌దారులకు సంబంధిత సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా పిటిషన్‌దారులు కూడా అందులో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలన్నారు. పిటిషన్‌దారు ఇచ్చిన వినతి పరిష్కారం కోసం సంబంధిత ప్రభుత్వ శాఖ చేపట్టిన చర్యలపై పూర్తి సమాచారం అదించడం ద్వారా తన సమస్య పరిష్కారం అవుతుందన్న విశ్వాసం కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ శాఖల ద్వారా పిటిషన్లు పరిష్కరిస్తున్న తీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

217 వినతుల స్వీకరణ

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఆమె 217 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. గత వారం రోజుల్లో పిటిషన్‌దారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై సమీక్షించారు. ఒక్కో వినతి వారీగా పరిష్కారానికి ఏ చర్యలు చేపట్టారు, దానిపై పిటిషన్‌దారులు ఎందుకు అసంతృప్తి చెందారనే అంశాలపై ఆరా తీశారు. ప్రజలు ఇచ్చే కొన్ని వినతులు పరిష్కరించేందుకు పలు శాఖల మధ్య సమన్వయం అవసరం ఉంటుందని అటువంటి సమయంలో ప్రత్యేక అధికారులు చొరవ తీసుకొని వివిధ శాఖల సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్‌తోపాటు జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓ ఎంవి సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, పద్మలీల, బి.సుదర్శనదొర తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: 'జగనన్నకి చెబుదాం' కార్యక్రమానికి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపించి, నివేదికలను సమర్పించాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌లతో కలిసి ప్రజల నుంచి 76 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌బ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, గ్రామ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి. నాయక్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి. జగన్నాథరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని వివరాలు ఇలా..

పాచిపెంట మండలం తామరాపల్లి గ్రామపంచాయతీలో అనేక గ్రామాలు ఉన్నాయని, గ్రామానికి గ్రామానికి మధ్య సరైన రోడ్డు సదుపాయం లేక రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని గ్రామపంచాయతీలో ఉన్న గ్రామాలకు బీటి రోడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ డి.సీతమ్మ, గ్రామస్తులు కోరారు.

- తన భూమికి రీ సర్వే జరిపించాలని గరుగుబిల్లి మండలం వల్లరగుడబ గ్రామానికి చెందిన గాదాపు ధనుంజయ నాయుడు కోరారు.
- ఎంపీహెచ్‌డబ్ల్యు ట్రైనింగ్ పూర్తి చేసి ఉన్నానని ఏదైనా ఉపాధి కల్పించాలని కొమరాడ మండలం సివిని గ్రామానికి చెందిన అలజంగి లక్ష్మి వినతిపత్రం సమర్పించింది. గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేశానని, కానీ ఇంతవరకు ఎటువంటి సమాచారం లేదని బలిజిపేట మండలంలో అంగన్వాడీ టీచర్ నియామకాలను త్వరగా పూర్తిచేసి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని బలిజిపేట మండలం గౌరీపురం గ్రామానికి చెందిన జి.సత్యవతి దరఖాస్తు అందజేసింది.
- గ్రీన్ అంబాసిడర్ ఉద్యోగులకు గత 9 నెలలుగా జీతభత్యాలు అందడం లేదని, జీతాలు ఇప్పించవలసిందిగా బి.మహేష్, తదితరులు కోరారు. తనకు రెండు ఎకరాల భూమి ఉందని, భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నానని తనకు స్ప్రేయింగ్ మిషన్ మంజూరు చేయవలసిందిగా కురుపాం మండలం బారతింగి గ్రామానికి చెందిన కె.కాంతారావు కోరాడు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్‌నర్సు పోస్టు మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో భర్తీ చేయనున్న స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఎపిడిమాలజిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ జాబితాను విజయనగరం.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తెలియజేయాలన్నారు.

స్పెషల్ స్కూల్స్ ఎన్‌జీఓలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల కోసం స్పెషల్ స్కూల్స్ నిర్వహిస్తున్న ఎన్‌జీఓలు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం 2023 ప్రకారం తక్షణమే ఎన్‌జీఓ సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకో వాలని కోరారు. రిజిస్ట్రేషన్ నమోదు పత్రా లను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఆ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయానికి అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్: 08922 274647 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.